క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో నాగాలమ్మ

విజయపురం (నగరి): మండలకేంద్రం విజయపురంలో బుధవారం రెండవ రోజు నాగలమ్మ ఆలయంలో మహా కుంభాభిషేకం వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు నాగాలమ్మకు నైవేద్యం, పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఆలయంలో గణపతిపూజ, స్వస్తివచనం, రక్షాబంధం, మృత్యుంగ్రహణం, అంకురార్పణ పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

నేడు గడప గడపకు ..

పాలసముద్రం: మండలంలోని ఆముదాల గ్రామ సచివాలయ పరిధిలోని గ్రామాల్లో నేడు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసన్ తెలిపారు. ఆముదాల గ్రామ సచివాలయంలోని జరిగే ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొని ప్రతి ఇంటికీ లబ్ధిదారులతో మమేకమవుతారని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు హాజరు కావాలన్నారు. ఉదయం 8 గంటలకే కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

ఆర్థికాభివృద్ధి సాధించండి

పాలసముద్రం: రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం స్త్రీనిధి, ఉన్నతి సంస్థ ద్వారా సత్వర రుణాలను అందించి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని అని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్ అన్నారు. బుధవారం ఐకేపీ కార్యాలయంలో డ్వాక్రా సంఘాల లీడర్లు, సంఘమిత్ర, వీఓ లీడర్లు, సీసీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రభుత్వం మరిన్ని ఎక్కువ రుణాలు అందించేలా స్త్రీనిధి, ఉన్నతి సంస్థను మెరుగు పరిచే బాధ్యత సభ్యులపై ఉందన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



విద్యార్థి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం: నాణ్యమైన విద్య ప్రభుత్వ కళాశాలలోనే సాధ్యం అవుతుందని, బాలికలు భవితకు చక్కటి పునాదులు పడతాయని 49 కొత్తపల్లిమిట్ట బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బండి లలితకుమారి అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బాలికల జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయడం జరిగిందన్నారు. కొత్తగా నియమితులైన ఉపాధ్యాయులతో కలిసి ఒడ్డుపల్లి, గంగమ్మగుడి, కొత్తపల్లి ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ గ్రామాల్లో తిరిగి ప్రభుత్వ కళాశాలలోనే విద్యార్థులను చేర్పించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యతో పాటు నైతిక విలువలతో పాటు క్రమశిక్షణ, సామాజిక స్పృహ, స్వీయ అభ్యసనకు అధిక ప్రాధాన్యత కల్పించి మెరుగైన విద్య అందిస్తామన్నారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థులకు అడ్మిషన్ చేయించారు. కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, హేమలత, లావణ్య, మాధవి, శ్రీనివాసులు, ధనుంజయులు, రాజమోహన్, చండీ ప్రసాద్, జానకిరామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం పదిలం



అవగాహన కల్పిస్తున్న పీడీ దామోదరం

కార్వేటినగరం: యోగాసనాలతోనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఫిజికల్ డైరెక్టర్(పీడీ) దామోదరం అన్నారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా కార్యక్రమానికి బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు యోగాసనాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ విద్యార్థులు ఆటలతో పాటు యోగాసనాలు వేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలమన్నారు. ప్రతి ఒక్కరూ యోగాసనాలపై ఆసక్తి పెంచుకుని శరీర దృఢత్వాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పద్మాసనం, భుజంగాసనం, శీర్షాసనం, సర్వాంగాసనం, వజ్రాసనం వంటి ఆసనాలపై అవగాహన కల్పించి వాటి ఉపయోగాలను వివరించారు.

తాగునీటి లీకేజీ



విజయపురం (నగరి): మండల కార్యాలయంలో తాగునీటి పైపు మరమ్మతులకు గురవడంతో నీరంతా వృథాగా పోతోందని, లీకేజీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు. పైపులైన్ మరమ్మతులకు గురై వారం రోజులవుతున్నా అధికారులు పట్టించుకోలేదు. కార్యాలయ ఆవరణలో ఉన్న సమస్యలను పరిష్కరించలేని అధికారులు గ్రామ సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా తాగునీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పెద్ద శేషవాహనంపై గోవిందుడు







స్నపన తిరుమంజనం సేవ నిర్వహిస్తున్న అర్చకులు, మాడవీధుల్లో తిరుచ్చి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు, పెద్దశేషవాహనంపై భక్తులను కటాక్షిస్తున్న శ్రీవారు

- ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

వడమాలపేట: అప్పలాయగుంటలో వెలసిన శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ధ్వజారోహణంతో అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. సకల దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానిస్తూ ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు ఆగమోక్తంగా ధ్వజారోహణ ఘట్టాన్ని వేద మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, కొలువు, తోమాలసేవ, అర్చన, మొదటిగంట తదితర కార్యక్రమాలు చేపట్టారు. అర్చకులు ఉదయం 8 నుంచి 8.30 గంటల వరకు స్వామివారికి తిరుచ్చి



ధ్వజారోహణం చేస్తున్న అర్చకులు

ఉత్సవం నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. శాస్త్రోక్తంగా గరుత్మంతుణ్ణి నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి ధ్వజస్తంభంపై ప్రతిష్ఠించారు. 18 గణాలను, ముక్కోటి దేవతలను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం దీని అర్థమని అర్చకులు తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 9.30 వరకు స్వామి, అమ్మవార్లకు వేడుకగా స్నపన తిరుమంజనం, సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఊంజల్‌సేవ నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయాన్ని ప్రత్యేక పుష్పాలతో, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

పెద్దశేషవాహనంపై శ్రీనివాసుడు..

బ్రహ్మోత్సవాల్లో మొదటి రోజు రాత్రి పెద్ద శేషవాహనంపై ప్రసన్న వేంకటేశ్వరస్వామి స్వామివారు మాడవీధుల్లో విహరించి భక్తులను కనువిందు చేశారు. వాహన సేవ అనంతరం స్వామివారికి ఏకాంత సేవ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఆలయ సూపరింటెండెంట్ శ్రీవాణి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకులు తిప్పాచార్యులు, కంకణ భట్టార్ సూర్యకుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాకుంభాభిషేకం

నింద్ర: మండలంలోని కొప్పేడు పంచాయతీ వేధాంతపురం ఎస్టీకాలనీలో నూతనంగా నిర్మించిన కొల్హాపురి అమ్మవారి ఆలయంలో మహాకుంభాభిషేకం వేడుకలు గురువారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం గోపూజ, గంగపూజ, అంకురార్పణ, కలశస్థాపన, మహావిష్ణుయాగం, సుదర్శన హోమం, మంత్రపుష్పం తదితరులు పూజలు వైభవంగా జరుగుతాయన్నారు. గురువారం ఉదయం అమ్మవారికి మహకుంభాభిషేకం, మధ్యాహ్నం



కుంభాభిషేకానికి ముస్తాబైన ఆలయం

అన్నదానం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని స్థానికులు కోరారు.

రోడ్డు సమస్య పరిష్కారం



రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కౌన్సిలర్లు

నగరి: పట్టణ పరిధిలోని 4, 5 వార్డుల పరిధిలోని చావడి ప్రాంతం నుంచి కామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయానికి వెళ్లే దారిలో, బ్రాహ్మణ వీధికి వెళ్లే మార్గంలో ఉన్న అప్రోచ్ రోడ్డు సమస్యకు పరిష్కారం లభించింది. ఏళ్ల తరబడి పరిష్కారం కాని ఈ సమస్యకు ఇన్నేళ్లకు పరిష్కారం దొరికింది. అప్రోచ్ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. రూ.లక్ష వ్యయంతో ఈ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు వార్డు కౌన్సిలర్లు గోపాల్‌రెడ్డి, దయానిధి తెలిపారు. బుధవారం పార్టీ నాయకుల సమక్షంలో పనులను ప్రారంభించారు. అప్రోచ్ రోడ్డు ప్రారంభోత్సవంలో పార్టీ నాయకులు చంద్రారెడ్డి, కౌన్సిలర్ భూపాలన్, ఇళంగో, తనికాచలం తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం: మండలంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని శ్రీనివాసన్ తెలిపారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఏపీఓ అనూష ఆధ్వర్యంలో ఉపాధిహామీ సిబ్బంది సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీనివాసన్ మాట్లాడుతూ మండలంలో ఉపాధిహామీ పథకంలో వేస్తున్న కూలీ సంఖ్య తగ్గిపోయిందన్నారు. అందువల్ల కూలీల సంఖ్య పెంచాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్లు ప్రతి గ్రామాలకు వెళ్లి ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పించి ఎస్సీ, ఎస్టీల ప్రతి కుటుంబానికీ పనులు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో చేస్తున్న పనులు మేట్లకు సహా



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసన్

యంతో కూలీల హాజరును ఆన్‌లైన్‌లో పెట్టాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు మేట్లను వేధిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, జరగకూడదని హెచ్చరించారు. వారంరోజుల్లో కూలీల సంఖ్య పెంచుకోకుండా పోతే తీవ్రపరిణామాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు, ఉపాధిహామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

రైతు భరోసాకు కదలిరండి

విజయపురం (నగరి): జిల్లాకేంద్రం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో గురువారం జరిగే మొదట విడత రైతు భరోసా కార్యక్రమానికి మండల రైతులను ఆహ్వానిస్తున్నట్లు ఏఓ రజినికుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో మొత్తం 4,455 మంది రైతులు లబ్ధి పొందారన్నారు. వీరికి ముఖ్యమంత్రి చేతుల మీదుగా మొత్తం రూ.3.34 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. అలాగే సబ్సిడీ వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల పంపిణీ శుక్రవారం ఉంటుందని తెలియజేశారు.

కాలం చెల్లిన భవనాల్లో వసతి గృహాలు వద్దు

కార్వేటినగరం: కాలం చెల్లిన పాత భవనాల్లో ప్రభుత్వ వసతి గృహాలు ఉండకూడదని ఈఓపీఆర్డీ లక్ష్మీపతి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్డీ మాట్లాడుతూ కాలం చెల్లిన పురాతన భవనాల్లో వసతి గృహాలు నడపడం వల్ల పలు ప్రమాదాలు పొంచి ఉంటుందన్నారు. కళాశాల బీసీ వసతి గృహం చాలా పురాతన భవనంలో ఉండడాన్ని గుర్తించి వాటిని వెంటనే నూతన భవనాల్లోకి తరలించడానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. అదేవిధంగా ఎస్సీ బాలుర వసతి గృహం, బాలికల ఇంటిగ్రేటెడ్ వసతి గృహాలను సందర్శించారు. పాఠశాలలు సెలవు దినాల్లో కూడా వసతిగృహాల్లో వాచ్‌మెన్లు విధులు నిర్వహించాలని ఆదేశించారు. వసతి



బీసీ బాలుర వసతి గృహాన్ని సందర్శిస్తున్న ఈఓపీఆర్డీ లక్ష్మీపతి

గృహాల ఆవరణల్లో పరిశుభ్రత లోపించినట్లు పేర్కొన్నారు. వసతి గృహాలు ఆధునీకరణకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. వారి వెంట మేజర్ పంచాయతీ కార్వేటినగరం ఈఓపీఎస్ మణి, పంచాయతీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండలకేంద్రంలో ఉన్న ఇండియన్ పెట్రోల్ బంక్‌ను డిప్యూటీ సీఎం నారాయణస్వామి పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్రోల్ బంక్ యాజమాన్యం ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించి, ప్రజామన్నలను పొందాలన్నారు. అనంతరం తన వాహనానికి డబ్బులు ఇచ్చి పెట్రోల్ పట్టించారు. కార్యక్రమానికి పెట్రోల్ బంక్ వ్యవస్థాపకుడు గోపి, జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ హరిత, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, నాయకులు జనార్దన్, కుప్పయ్య, భూపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరులో మెగా జాబ్‌మేళా రేపు

పుత్తూరు రూరల్: పట్టణంలోని ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జూన్ 2వ తేదీ శనివారం ఉదయం 9 గంటలకు మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారి గుణశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 16 ప్రముఖ కంపెనీలతో జరిగే మెగా జాబ్‌మేళా 1500 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదో తరగతి పాస్/ఫెయిల్ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగిన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 63009 54441, 83744 21195 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలకు సంబంధించి బుధవారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో అభిషేకాలు నిర్వహించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ చేపట్టారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ ఆవరణలో ఉన్న ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేసి సకల దేవతలకు ఆహ్వానం పలుకుతూ శాస్త్రోక్తంగా ధ్వజారోహణం నిర్వహించారు. మధ్యాహ్నం భాగవతారిణి నాగరత్న హరికథా కాలక్షేపం జరిగింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త బండి ఉమాపతిరెడ్డి రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు, యువత పెద్దఎత్తున పాల్గొన్నారు.

పొగాకు ఆరోగ్యానికి హానికరం





వడమాలపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, పచ్చికాపల్లంలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

వడమాలపేట: పొగాకు వాడడం వల్ల ఆరోగ్యానికి హానికరం అని డాక్టర్ భానురేఖ అన్నారు. బుధవారం వడమాలపేట మండల కేంద్రంలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు వాడడం వినియోగించడం హానికరం అని, యువత చాలామంది పొగాకు మాదక ద్రవ్యాలను తినడం వల్ల నోటి క్యాన్సర్, గుండెకు సంబంధించిన వ్యాధులు, శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు ఎక్కువగా వస్తాయని తెలిపారు. పొగాకు విచ్చలవిడిగా వాడడం వల్ల ప్రపంచవ్యాప్తంగా 8 మిలియన్ల మంది ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. దేశంలో 2025 సంవత్సరం కల్లా టీబీ వ్యాధిని దేశం నుంచి పారదోలేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి పురుషోత్తంరెడ్డి, మంజుల, గౌరి, చంద్రమోహన్ పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి కృషి చేద్దాం

వెదురుకుప్పం: పొగాకు రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఏఎంసీ డైరెక్టర్ అత్తూరు సురేష్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పచ్చికాపల్లంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పొగాకు వాడకానికి వ్యతిరేకంగా ర్యాలీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల ఆరోగ్యం క్షీణించి అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని చెప్పారు. ప్రభుత్వం వైద్యం, ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ ప్రభుత్వ నిషేధిత పదార్థాలను వాడకూడదన్నారు. అనంతరం ఏఎస్‌ఎం సుధ మాట్లాడుతూ మత్తుపదార్థాలు సేవించడం, వాటికి బానిస కావడం వల్ల అనారోగ్యం బారిన పడి ప్రాణాలు సైతం కోల్పోయే ఆస్కారం ఉంటుందన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు కొన్ని అలవాట్లను దూరం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ సుమతి, పుష్ప పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోహన్‌కృష్ణ, ఆశా నోడల్ ఆఫీసర్ సుశీల ఆధ్వర్యంలో పొగాకుతో కలిగే నష్టాలపై ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ మోహన్‌కృష్ణ మాట్లాడుతూ జీవితంలో ఎప్పటికీ పొగాకు ఉత్పత్తులు వాడకం వినియోగించకూడదని తెలిపారు. పర్యావరణాన్ని పొగాకు ఉత్పత్తుల వినియోగం నుంచి రక్షించడానికి ప్రయత్నిస్తానని ప్రతిజ్ఞ చేశారు.

గంగమ్మ ఆశీస్సులు అందాలి

వడమాలపేట: గ్రామ ప్రజలకు గంగమ్మ దేవత ఆశీస్సులు అందాలని రాష్ట్ర పర్యాటక శాఖ ఆర్‌కే రోజా సోదరుడు రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన తిరుమణ్యం గ్రామంలో జరిగిన గంగమ్మ జాతరలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పుత్తూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేఖర్, వైస్ ఎంపీపీ ఉపేంద్ర, కన్వీనర్ సుబ్రమణ్యరెడ్డి, కాయం సింగిల్‌విండో అధ్యక్షుడు సుదీర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మదన్‌మోహన్ రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సురేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో సీఎం జగనన్నకు బ్రహ్మరథం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: రాష్ట్రంలో చరిత్రాత్మక సంక్షేమ పథకాలు అందించి ప్రజలను ఆదుకుంటున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి అన్నారు. బుధవారం మండలంలో శ్రీరంగరాజపురం సచివాలయ పరిధిలోని రాఘరాజపురం, రిపుంజరాజపురం, సింధురాజపురం, పాపిరెడ్డిపల్లి ఏఎడబ్ల్యూ, ఏఎంపురం గ్రామాల్లో రెండవ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాలు అందుతున్నాయా ? లేదా ? అని ఆరా తీశారు. అనంతరం డిప్యూటీ సీఎం మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కాని పథకాలు మన రాష్ట్రంలో అమలు జరుగుతున్నాయని చెప్పారు. పేద విద్యార్థులకు విదేశీ విద్యను చేరువ చేయడానికి విదేశీ విద్యాదీవెనను తీసుకొచ్చారని గుర్తుచేశారు.

చంద్రబాబుది నీచబుద్ధి..

పేద పిల్లలు ఆంగ్ల మాధ్యమం చదువుకోవడం చంద్రబాబుకు నచ్చదని, అదిఅతని నీచబుద్ధికి నిదర్శనమన్నారు. అనంతరం పాపిరెడ్డిపల్లి ఏఎడబ్ల్యూకు రోడ్డు ఏర్పాటు చేయాలని, ఏఎంపురం హెచ్‌డబ్ల్యూకు డ్రైనేజీ, కల్వర్టు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు మంత్రికి విన్నవించారు. అలాగే రాఘవరాజపురానికి డ్రైనేజీ, అర్హులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని స్థానికులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో స్పందించిన ఆయన వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జెడ్పీటీసీ రమణప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు మల్లిక, హరిత, ఎంపీటీసీ శివయ్య, వైస్ ఎంపీపీ లోకనాథరాజు, మండల పార్టీ కన్వీనర్ మణి, మాజీ కన్వీనర్ అనంతరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు గురవారెడ్డి, నాయకులు అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

వెదురుకుప్పం: మండలాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అందరి సహకారం అవసరమని ఎంపీపీ నాగరాణి అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అయితే కొంతమంది అధికారులు మండల సర్వసభ్య సమావేశాలకు రావడం లేదని, వారికి ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు. మండల మీట్‌కు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుధాకరరావును ఆదేశించారు. సమావే



మాట్లాడుతున్న ఎంపీపీ నాగరాణి

శంలో జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్, సింగిల్‌విండో చైర్మన్ లోకనాథరెడ్డి, తహసీల్దార్ పుల్లారెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్, మురళీరెడ్డి, గుణశేఖర్, హరి, పుష్ప, సర్పంచ్ సంఘ మండల అధ్యక్షురాలు భారతి, ఈఓపీఆర్డీ పురుషోత్తం, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తిమ్మరాజు, సర్పంచ్‌లు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'చిదా'మిల్లు కార్మికుల ధర్నా

పుత్తూరు రూరల్: స్థానిక చిదా స్పిన్నింగ్ మిల్లులో పనిచేసే కార్మికులు జీతాలు చెల్లించాలంటూ బుధవారం మిల్లు ముందు ధర్నా నిర్వహించారు. కార్మిక సంఘ నాయకుడు ఏలుమలై రెడ్డి మాట్లాడుతూ మిల్లు యాజమాన్యం మొండి వైఖరి విడనాడి కార్మికులకు జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి మాట్లాడుతూ యాజమాన్యం మిల్లును అర్ధాంతరంగా మూసివేసి కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడడం అన్యాయం అన్నారు. 2022 ఫిబ్రవరిలో లేబర్ డిపార్ట్‌మెంట్ సమక్షంలో కార్మిక సంఘ నాయకులు, యాజమాన్యం మధ్య కుదిరిన వేతన ఒప్పందం ప్రకారం నాలుగేళ్ల పాటు మిల్లును యథావిధిగా నడపాలని డిమాండ్ చేశారు. కార్మిక సంఘాల మధ్య చిచ్చుపెట్టి తమ పబ్బం గడుపుకోవాలని యాజమాన్యం చూస్తోందని ఆరోపించారు. యాజమాన్యం మొండి వైఖరి కారణంగా నేడు 171



చిదా స్పిన్నింగ్ మిల్లు వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

మందిని కార్మికులు పనులు లేక రోడ్డున పడ్డారని చెప్పారు. జూన్ 12వ తేదీన డీసీఎల్ సమక్షంలో జరిగే చర్చల్లో యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు రాజేంద్ర, రవిచంద్ర, రామ్మూర్తి, గోవిందరాజు, రఘుపతి, నాగూరు, మాస్యమని తదితరులు పాల్గొన్నారు.

కమీషన్లు తీసుకుంటే ట్రేడర్ లైసెన్స్ రద్దు

– మార్కెటింగ్ ఆర్జేడీ రామాంజనేయులు

పుత్తూరు రూరల్: మార్కెట్ యార్డుల్లోని మండీ యజమానులు మామిడి రైతుల నుంచి కమీషన్లు వసూలు చేస్తే ట్రేడర్ లైసెన్స్‌లు రద్దు చేస్తామని కడప మార్కెటింగ్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ రామాంజనేయులు హెచ్చరించారు. బుధవారం పుత్తూరు మార్కెట్ యార్డులోని మండీల్లో ఆర్జేడీ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బిల్లు బుక్స్‌ను పరిశీలించారు. కమిషన్లు తీసుకొన్నట్లు ఏ ఒక్క రైతు నుంచి ఫిర్యాదు అందిన సదరు వ్యాపారి ట్రేడ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. రైతుల నుంచి ఒక టన్నుపై తల్లు (సూట్) కింది 30 కేజీలను తీసుకోవడాన్ని నిలిపి వేయాలని తేల్చి చెప్పారు. ఈ రెండు విషయాలపై రోజువారీ తనిఖీలు నిర్వహించాలని మార్కెట్ కమిటీ ఇన్‌చార్జ్



మండీ యజమానితో మాట్లాడుతున్న ఆర్జేడీ రామాంజనేయులు

సెక్రటరీ లక్ష్మీప్రసాద్‌ను ఆదేశించారు. మామిడి నాణ్యత, రేట్లపై ఆరా తీశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ కారణాల చేత ఇబ్బందులు పడుతున్న మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడానికి ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

మీ సాయం.. మే మరువం..

నగరి/పుత్తూరురూరల్: మీ సాయం.. మేము మరువం అని గర్భిణులు కొనియాడారు. ప్రభుత్వ ఆస్పత్రికి వైద్యపరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. గర్భిణులు ఆస్పత్రికి వైద్య పరీక్షల కోసం వచ్చి వేచి ఉంటారు. దీంతో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడుతున్నారన్న విషయం మంత్రి ఆర్కేరోజా దృష్టికి వచ్చింది. దీంతో స్పందించిన ఆమె నగరి, పుత్తూరు ఆస్పత్రుల్లో గర్భిణులకు ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పూర్తి చేసుకున్న



నగరి: పౌష్టికాహారం అందిస్తున్న వైద్యసిబ్బంది

సందర్భంగా చికిత్స నిమిత్తం ఆస్పత్రులకు వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు విందు భోజనం పెట్టారు. వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు, రైతాతో కూడిన పౌష్టికాహారం అందించారు.

గంగమ్మకు పొంగళ్లు

వెదురుకుప్పం: మండలంలోని ధర్మాచెరువు గ్రామంలో గంగజాతర వేడుకలు వైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి అమ్మవారిని పుష్పపల్లకీలో వేంచేపు చేసి ఊరేగించారు. బుధవారం ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా పూజలు జరిగాయి. అదేవిధంగా పాతగుంటలో కరకమాని గంగమ్మ, చెన్నుగారిపల్లె గ్రామంలో కరకమాని గంగమ్మ ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో వేడుకలు జరిగాయి.

పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలోని సింహరాజుపురం గ్రామంలో వెలసిన ఆరిమాను గంగమ్మతల్లికి కొలుపు మహోత్సవం సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు. ఉదయం అమ్మవారిని అంబలిపోసి పూజలు చేశారు. మధ్యాహ్నం మహిళలు పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారి ఎదుట





అలంకరించిన ఆరిమాను గంగమ్మతల్లి, పూజలు చేస్తున్న ప్రతాప్ స్వామి

పలు రంగుల పొడర్లతో బొమ్మవేసి హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శ్రీరంగరాజపురం: అశేష జనవాహిని మధ్య గంగ జాతరను గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని మద్రిపల్లి, జీఎంఆర్ పురం గ్రామాల్లో గంగమ్మ జాతర సందర్భంగా ఆటపాటలతో మంగళతోరణాల మధ్య ఉత్సవమూర్తి అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. ఉభయదారులుగా గుణశేఖర్ నాయుడు వ్యవహరించారు. కార్యక్రమానికి గ్రామపెద్దలు తిరుమల, మునికృష్ణ, ఉమాపతి, ఆనందయ్య, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.